

యర్రమిల్లి విజయలక్ష్మి

# నమ్మరాదే చెలీ...!

''సౌ..సౌ..! నిన్నే...'' మంచం మీద గోడవారకు వత్తిగిలి పెడముఖంగా వున్న సౌభాగ్యను వందోసారి పిలిచాడు అరవింద్. ఊ..హు.. ఉలుకులేదు, పలుకులేదు. 'ఊ' లేదు, 'ఆ' లేదు. కడగంటి చూపు తూపైనా లేదుసరికదా.. అతని స్పర్శామాత్రాన్ని కూడా సహించ లేనిదానిలా టచ్‌మి నాట్‌లా ముడుచుకు-ముడుచుకుపోతోంది.

ప్రియపత్ని తీరు అతనికేమీ అర్థంకాకుండా వుంది. విషయం తెలియక అయోమయంగా వుంది. వెన్నెల రాత్రంతా వ్యర్థంగా కరిగిపోతున్నందుకు బాధగానూ వుంది. ఈ నిరసన వ్రతానికి వెనుకగల అసలు కథ తెలియక కలవరపాటుగా కూడా వుందతనికి. అన్నింటికీ మించి ఆమె అలకకు గల కారణాల అన్వేషణ పక్కన వుంచి, ప్రసన్నం చేసుకోవాలనే వేగిరపాటు అతన్ని మరీ నిలువనీయకుండా వుంది.

''సౌ..'' నిట్టూర్పు సెగలతో వేడెక్కి.. అసాధారణ అరుణిమతో జేవురించిన చెక్కిలి మీదకు ఎల్లాగో ప్రయత్నం మీద పెదిమలు చేర్చి- చెదిరిన ముంగురులు సవరించాలని ప్రయత్నిస్తూ నూటొక్కసారి పలవరించాడు. పిలుపు పిలుపుకీ టోన్‌లో మాడ్యులేషన్స్ మారిపోకుండా జాగ్రత్త పడుతున్నాడు. పిలుపులో లాలిత్యం, మృదుత్వం, ప్రేమ, ప్రియత్వం సడలిపోయి- విసుగు, అసహనం చోటుచేసుకున్నాయంటే.. మరి వ్యవహారం మరింత బెడిసికొట్టే ప్రమాదముంది.

''ప్రియా! వెన్నెల చూడు.. మనకోసమే ఎలా విరగకాస్తోందో.. ఆహా!'' అంటూ ఆగి, గుండెల నిండా హాయిగా గాలి పీల్చుకుని.. ''ఓహ్.. గాలి చూడు ఎంత పరిమళిస్తోందో.. మన ప్రేమలాగే.. కదూ!'' కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రతి పురుషుడు తప్పనిసరిగా ఒక ప్రణయభావ కవి కావాలని అరవింద్ అభిప్రాయం.

ఊ..హు.. అతని ప్రణయాలాపాలకు ఎప్పటిలా ఆమె కోర్కెలు చెలరేగిపోతుండగా రెచ్చిపోలేదు. తమకంతో అతన్ని అల్లుకుపోలేదు. 'అరూ.. నా అరవింద్..' అంటూ ఉన్మత్త భావుకతతో ఆర్తిగా ఆలింగనం చేసుకోలేదు. అదే భంగిమ.. అదే విముఖత. ఎక్కడా స్పందన లేదు. కదలికలేదు. ఊర్పుల వేడిసెగలు తనువెల్లా కమ్ముకుని అతలాకుతలం చేస్తున్నా.. బింకంగా.. విన్నవింపులకు, కవ్వింపులకు.. అలరింపులకు అతీతంగా శిలాసదృశంగా వుండిపోయింది.

అతనికి ఆశ్చర్యంగా వుంది. అసలేం జరిగిందో తెలియకుండా వుంది. ఈ మెరుపు సమ్మెకు కారణం ఎంత ఆలోచించినా అవగతం కావటంలేదు. ఈ రకమైన సమస్య అతనికింతవరకూ ఎదురుకాలేదు- పాలు, పంచదార కలిసినట్లు మధుర మధురంగా ఏకమై రోజులు క్షణాల్లా గడిపెయ్యటం తప్ప.

''ఏమిటి.. సౌ! ఏం జరిగిందో చెప్పు. ఏదో మనసులో వుంచుకుని ఎందుకు నన్నిలా వేధిస్తావు'' ఆమె భుజాలు గుచ్చి పట్టుకుని ఒకవిధంగా బలవంతంగా తనవైపు లాక్కోవాలని ప్రయత్నించాడు. ఏడు మల్లెలెత్తు మగువ.. గులాబి చెండులా మృదువుగా సున్నితంగా వుండే సమసదృశ కోమలాంగి.. అకస్మాత్తుగా వందలాది కిలోల బరువు పెరిగి- ఇనుప గుండులా బరువెక్కి.. అతని ప్రయత్నం ఫలించలేదు.

అరవింద్ బరువుగా నిట్టూర్చాడు. వలపు సెగలను వెలువరిస్తున్న ఊర్పుల తావి ఆమెనేమాత్రం తాకినట్టు లేదు.

''హు.. సరే! నీ ఇష్టం'' అతను లేచాడు. త్రిబుల్ ఫైవ్ ముట్టించి- షర్ట్ వేసుకున్నాడు.

''తలుపేసుకో..''

ఈ మాట వింటూనే శిలకే కదలిక వచ్చిందాన్నట్లు చట్టున లేచి కూర్చుంది.

''ఎక్కడికి.. ఇంత రాత్రివేళ?!'' మౌనవ్రతాన్ని మరచి అడిగింది. అరవింద్ అదోలా చూసాడు. తమాషాగా భుజాలెగరేసి- నిర్లిప్తంగా నవ్వి- గుండెలనిండా సిగరెట్ పఫ్ లాగాడు. ఏమీ సమాధానం చెప్పకుండా స్లిప్పర్స్ వేసుకుని కూల్‌గా బయటకు కదిలాడు.

''హు.. ఎంత పొగరో చూడు..! అడుగుతున్నా మాట్లాడకుండా ఎలా వెళ్ళిపోయాడోనూ!'' కోపంగా గొణుక్కుని గోడకున్న క్వార్జ్ క్లాక్ వంక చూసింది. పన్నెండు కావస్తోంది. ఇంత రాత్రివేళ ఈయనకి బయ్టేంపని. ఎక్కడకు పోతున్నట్లు.. కొంపతీసి.. ఆ కుముద చెప్పినట్టు.. సౌభాగ్య గుండె ఆగిపోయినట్లనిపించింది. ''అయ్యబాబోయ్! ఏం చెయ్యాలిప్పుడు... అసలే దుందుడుకు మనిషి. ఛ.. ఛ.. తనకసలు బుద్ధిలేదు. వట్టి పాతకాలపు మనిషిలా ఈ అలకేమిటి? అలిగినా ఈవేళప్పుడా.. అందునా ఈ వెన్నెల రాత్రా! ఏదో సాధిద్దామనుకొంది. అసలే మొండిమనిషి. అలకలు, చిలకలు సహించడు. ఎప్పుడు నవ్వుతూ, తుళ్ళుతూ వుండాలంటాడు. ఏమిటో అతని తత్వం, తెలిసినా పట్టరాని కోపంతో బిగుసుకుపోయింది.

ఎవరు మాత్రం సహించగలరు. అల్లాంటి పన్లు..! అకస్మాత్తుగా వాకౌట్ చేసిన ప్రతిపక్ష అభ్యర్థిలా భర్త వున్నట్లుండి అలా చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయేసరికి సౌభాగ్య మూడ్ మారిపోయింది. అంతవరకూ కోపంతో సెగలు, పొగలుగా మండిపడిన గుండె- చిత్రమైన భయంతో చల్లగా మారిపోయింది. వళ్ళంతా చెమటలు కమ్ముకొచ్చాయి. అతన్ని సమర్థించలేదు- నిలదీసి ఏమని.. ఎలా ప్రశ్నించాలో తెలియదు. అలా అని అతన్ని దూరం చేసుకుంటానేమోనన్న భయం. అతను పట్టించుకోకుండా మౌనంగా వెళ్ళిపోవటం ఆమె అహంకారాన్ని రెచ్చకొడుతోంది. ఉక్రోషంతో మనసు నిబ్బరాన్ని కోల్పోతోంది.

రోజులు గడుస్తున్నాయి. సామరస్యం కుదరకపోగా- ఇద్దరి మధ్య సెగలు పొగలుగా వుంది. ఆమె మొండితనంతో విసిగిపోయాడేమో అతనూ ముక్తసరిగా తనపన్లు చేసుకుపోతున్నాడు. ఆమె సరేసరి! మరీ మౌనవ్రతమే పట్టేసింది. అతని మౌనం అహంకారంగా- ఆమెను పట్టించుకోకుండా తనమానాన తాను తిరగటం అలక్ష్యంగా భావించి ఉక్రోషంతో తల్లక్రిందులైపోతోంది. చాలామంది ఆడవాళ్ళలా భర్తను మార్గంలోకి తెచ్చుకునే తరుణోపాయం ఇదేననుకుంటోంది. చతురోక్తులు లేవు- సరస సల్లాపాలు లేవు. అనిమిషులై ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ- రాత్రులకు రాత్రులు తెల్లవారిపోయే రాగవల్లరులసలే లేవు. పగలు పెంచుకొంటున్న ప్రతిపక్ష నాయకుల్లా మారిపోయారు. అతనింటి పట్టున వుండటం తగ్గిపోయింది. సాయంత్రం ఐదు కొట్టీకొట్టకుండానే ఆమె సన్నిధిలో వాలిపోయేవాడల్లా.. ఆఫీసు వదిలాక నేరుగా ఇంటికి రావటమేలేదు. ఎప్పుడో నిద్ర ముంచుకొచ్చేవేళకి వచ్చి- తినో-తినకో.. వంటరిగా డాబా ఎక్కేస్తున్నాడు. దీనంతటికీ కారణమేదో ఊహించుకుని ఆమె అతలాకుతలమైపోతోంది. రోషంతో- ఉక్రోషంతో.. కోపంతో.. కసితో రగిలిపోతోంది. అగ్గి గుగ్గిలమై చిటపటలాడిపోతోంది. నిమిషమైనా ఒకరిని విడిచి ఒకరు మనలేరన్నంత ప్రేమాతిశయంతో తలమునకలయ్యే జంట- ఒకరి ఉనికి మరొకరు సహించలేని శత్రువుల్లా మారిపోయారు.

● ● ●

ఆ మధ్యాహ్నం వచ్చింది నీరజ- అరవింద్ కొలీగ్ ఆనంద్ భార్య నీరజ. ఈమధ్యే పెళ్ళయింది. కొత్తకాపురం చూడముచ్చటైన జంట. కొలీగ్స్ మాత్రమే కాకుండా- అరవింద్ - ఆనంద్ ఇద్దరూ మంచి స్నేహితులు కూడా. పెళ్ళికాకముందు ఆనంద్ తరుచు వీళ్ళిం

టికి వస్తుండేవాడు. ఆదివారాలు సెలవులప్పుడు పండగలకి వీళ్ళింట్లోనే లంచ్ చేసేవాడు. అతనికి అరవింద్, సౌభాగ్య అంటే ఎంతో గౌరవం, అభిమానం. అల్లాంటిది పెళ్ళయ్యాక వీళ్ళని పూర్తిగా మరచిపోయినట్టే వున్నాడు. వాళ్ళ ఇల్లు కూడా బాగా దూరం.

''రా..రా నీరజా.. చాలారోజులైంది నిన్నుచూసి'' అంటూ ఆహ్వానించింది. నీరజ నీరసంగా వచ్చి కూర్చుని డైనింగ్ టేబిల్ మీద వున్న నీళ్ళు గటగట తాగింది. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ- ఉల్లాసంగా వుండే నీరజ వంక చిత్రంగా చూసింది సౌభాగ్య. కళకళలాడే నీరజ ముఖం వడిలిపోయి అదోలా వుండటం చూసి గాభరాగా అడిగింది- ''నీరజా ఏమిటల్లా నీరసంగా వున్నావు? వంట్లో బాగుందా..''

''వంట్లో బాగానే వుంది'' అని డల్‌గా కూర్చుంది.

''మరేమిటల్లా వున్నావు? ఏమన్నా 'విశేషమా'?''

కాస్త సిగ్గుపడి- నవ్వు లేక నవ్వి- ''అబ్బెబ్బె.. అదేం లేదు.''

ఏదో విశేషమే వుందనుకుంది సౌభాగ్య.

''మరేమిటి? ఏం జరిగింది నీరజా.. ఆనంద్ ఊళ్ళో వున్నాడా?''

అతని పేరు సౌభాగ్య ఎత్తగానే నీరజ కళ్ళ నిండా నీళ్ళు చేరాయి. బలవంతాన ఏడుపు ఆపుకుని ''ఊ..'' అంది తలదించుకుని. నీరజకన్న ఒక సంవత్సరకాలం వైవాహిక జీవితంలో సీనియారిటీ గడించిన సౌభాగ్య విషయం కాస్త సీరియస్సేనని.. నీరజ దగ్గరకు వచ్చి ''ఏం జరిగింది నీరజా.. అదే.. ఏమిటా కన్నీళ్ళు.. ఛ ఊరుకో. అసలు విషయమేమిటో చెప్పు'' అంది భుజం మీద చెయ్యివేసి అనునయంగా. ఆ పలకరింపుకి కదిలిపోయింది నీరజ. వేదన మరి ఇక తనలో ఇముడ్చుకోలేక చెప్పింది.

''నిన్న వాళ్ళఫీసులో పనిచేసే కుముదగారొచ్చారు ఇంటికి.. ఆవిడ..'' అంటూ నీరజ చెప్పినదంతా విన్నాక నివ్వెరపోయింది సౌభాగ్య. ''వాళ్ళ ఆఫీసుకు రోజూ ఒక అమ్మాయి వస్తుందట! మనిషి మోడ్రన్‌గా- స్టైల్‌గా వుంటుందట. ఎప్పుడూ ఆనంద్ దగ్గరకే వెడుతుందట. తన పనంతా అతనిచేతే చేయించుకుని- వదల్లేక, వదల్లేక వెడుతుందట. ఇక ఉన్నంతసేపూ ఆ చిలిపి చూపులు- మందహాసాలు చెప్పనేలేదట. అందరూ 'వీళ్ళ' గురించి గుసగుసలు పోతున్నారట. కొందరైతే 'నీ కాండిడేట్ వచ్చిందోయ్' అంటూ ఓపెన్‌గానే జోక్ చేస్తున్నారట. 'ఆనంద్ పాపం మంచివాడే! అయినా మన జాగ్రత్తలో మనముండాలి. ఆడది పైపైన పడుతుంటే అతను మాత్రం ఏం చెయ్యగలడు? అయినా నాకేం సంబంధం చెప్పు. నీ మేలుకోరి చెప్పటం కాని.. కాస్త జాగ్రత్తగా తెలివిగా వుంటావని చెప్తున్నాను.



మగాళ్ళెప్పుడూ ఇంతే! వాళ్ళని పూర్తిగా నమ్మెయ్యకూడదు. ఓ కంట కనిపెడుతూనే వుండాలి... ఎప్పుడూనూ' అన్నారండి కుముదగారు..'' ధారగా కారిపోతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ గుండెల్లోని బరువు దించుకుంది నీరజ.

నీరజ చెప్తున్న ప్రతీమాట సౌభాగ్య మనసులో అంతులేని ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 'ఇదెలా సంభవం- కుముద కొద్దిపాటి తేడాతో కథ మార్చి- మాటలు మార్చి ఒకే సారాంశం తమిద్దరికీ చెప్పిందేమిటి?' అనుకోగానే ఒక్కసారిగా ఏదో అర్థమై సౌభాగ్య మనసులో చెప్పలేని కలవరం- ఆవేశం చోటుచేసుకున్నాయి. ఎంతపని జరిగింది?! వివేకం- సంస్కారం మరిచి తనెంత పిచ్చిగా ప్రవర్తించింది.' ఎదురుగా కన్నీటితో నీరజ.. పాపం పిచ్చిది, అంతా నిజమేనని గాభరాపడిపోతూ తనతో చెప్పుకుని ఏదన్నా పరిష్కారం తెలుసుకోవాలని వచ్చింది. ఇద్దరికీ మంచిదే అయింది.

తన ఆలోచనల్ని కట్టిపెట్టి- నీరజ భుజం మీద చెయ్యివేసి స్నేహంగా అంది- ''అదా?! నీరజా ఈర్ష్యా ద్వేషమో- ఇతరులు హాయిగా వుంటే చూడలేనితనమో.. కొందరు ఏదో చెప్తుంటారు. ఇతరులు ఆనందంగా, హాయిగా వుంటే సహించలేక విషం చిందించే శాడిస్టులు కూడా వుంటారు. ఏదో వుంటుంది వాళ్ళలా ప్రవర్తించటానికి. అవన్నీ మనం పట్టించుకోకూడదు. అది ఒక మానసిక రుగ్మత అంతే! ఆనంద్ యోగ్యుడు. అతను నిన్నెంత ఆరాధిస్తున్నాడో నేను చెప్పాలా? భార్యాభర్తల మధ్య ఒక్క ప్రేమేకాదు నీరజా.. నమ్మకం.. అచంచలమైన విశ్వాసం వుండాలి. అప్పుడే ఇల్లాంటి గాలివార్తలెన్ని విన్నా మన ప్రేమ చలించదు.. నీ మనసుకు నీకు తెలియదూ ఆనంద్ ఎలాటి వాడో...''

''అంతేనంటారా..'' కాస్త సిగ్గుపడుతూ తన తొందరపాటుకు బాధపడుతూ అంది నీరజ. ఆమె ముఖంలోకి మళ్ళీ జీవం వచ్చింది.

''అంతే! లేనిపోని కాలాన్ని వ్యర్థం చేసుకోకు. నేచెప్తున్నాగా.. బీ ఛీర్‌ఫుల్! అరె.. ఐదైపోతోంది. అరవింద్ వచ్చేవేళవుతోంది.. ఆనంద్ కూడా వచ్చేస్తాడుగా.. లే..లే..''

''సరే.. కానీ.. మీ పూలవాడొస్తే నాకొక బుట్టెడు పూలు పంపవా నీరజా!'' వారం రోజుల ఎడబాటు.. చేదు అనుభవం కొత్తపాఠం నేర్పుతోంది-

సౌభాగ్య వంక వింతగా చూచి.. చిత్రంగా నవ్వి... ''చాలా!'' అంటూ ఆటో ఎక్కి ''త్వరగా పోనీ'' అంది నీరజ.

★